క్లుప్తంగా

అందుకూరులో బ్లాంకెట్ సర్వే



క్రోసూరు: అందుకూరు గ్రామంలో పశు సంవర్ధక శాఖ సిబ్బంది ద్వారా మండలంలో గత నెల నుంచి నిర్వహిస్తున్న బ్లాంకెట్ సర్వేలో భాగంగా సోమవారం మండల పశు వైద్యులు బషీర్ పాల్గొని పాడి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులకు పశు సంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు జరుగుతున్న ప్రయోజనాలు గురించి వివరించారు. అదే విధంగా ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా పశు వైద్యులు బషీర్ మాట్లాడుతూ మండలంలో 2,931 మంది పాడి రైతుల బ్లాంకెట్ సర్వే చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటికి 1,158 మంది రైతుల సర్వే పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ నెల 31 వరకు ఈ సర్వే జరుగుతుందన్నారు. కావున రైతులందరూ సహకరించాలని కోరారు.

ఎంఈవోగా కృష్ణ బాధ్యతల స్వీకరణ



క్రోసూరు: మండల విద్యాశాఖ అధికారి-1గా జి.కృష్ణ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు క్రోసూరు ఇన్‌చార్జి ఎంఈవోగా పని చేసిన ఏకుల ప్రసాదరావు స్థానంలో పూర్తి స్థాయి ఎంఈవోగా కృష్ణ వచ్చారు. గుంటూరులోని ఎస్‌పీకేహెచ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ పదోన్నతి పై క్రోసూరు ఎంఈవో-1గా వచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 2 అర్జీలు



ముప్పాళ్ళ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు రెండు అర్జీలు అందినట్లు తహసీల్దార్ కె.నగేష్ తెలిపారు. తొండపి గ్రామంలో దేవదాయ భూమికి సంబంధించి పట్టాదారు పేరు తప్పుగా నమోదుపై, దమ్మాలపాడు గ్రామంలో వెబ్‌ల్యాండ్ సవరణ కోరుతూ అర్జీలు అందాయన్నారు. ఆయా అర్జీలను పరిష్కరించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతి కోసం పనిచేయాలి

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అచ్చంపేట: నూతనంగా ఎంపికైన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ కమిటీ రైతుల అభ్యున్నతి కోసం పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మండలంలోని వేల్పూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్‌పర్సన్‌గా వేల్పూరుకు చెందిన జువ్వా రామారావు, డైరెక్టర్లుగా పాటిబండ్ల వెంకటేశ్వర్లు(పెద పాలెం), కుంభా లక్ష్మణ్ (కొండూరు) సోమవారం సంఘ ఆవరణలో పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథి గా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ సొసైటీలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చు కుని రైతుల కోసం పని చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులకు చేరువ చేయాల్సిన బాధ్యత నూతన కమిటీపై ఉందన్నారు. అనంతరం చైర్‌పర్సన్, డైరెక్టర్ల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమలో సొసైటీ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కేజీబీవీలో బాలికలకు వైద్య పరీక్షలు



రాజుపాలెం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా చైల్డ్ హెల్త్ స్క్రీనింగ్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవితేజ నాయక్ సోమవారం నిర్వహించారు. బాలికలకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారిని గుర్తించి మందులు పంపిణీ చేసి సూచనలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 6 నుంచి 15 ఏళ్ల లోపు బాల బాలికలకు స్క్రీనింగ్ టెస్టులు అక్టోబర్ చివరి వరకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ప్రిన్సిపాల్ జోతిర్మయి, ఏఎన్ఎం రాజ్యలక్ష్మి, లక్ష్మీతిరపతమ్మ, సుమన్, ఆశా కార్యకర్తలు ప్రసన్న, రాధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నారుమళ్లకు వర్షపు గండం



నర్శింగపాడు సమీపంలో వర్షపు నీటికి కొట్టుకుపోయిన వరి నారుమడి



దేచవరం సమీపంలో నీట మునిగిన వరి నారుమడి

- వర్షాలకు దెబ్బతింటున్న వరి నారుమడులు
- పెరుగుతున్న పెట్టుబడి భారం, ముంచుకొస్తున్న సమయాభావం
- రాయితీ విత్తనాలు పంపిణీ చేయాలని కోరుతున్న రైతులు

నకరికల్లు: వరి నారుమడులకు వర్షపు గండం వచ్చి పడింది. విత్తనాలు చల్లే సమయంలో కురుస్తున్న వర్షాలకు వరి విత్తనాలు, మొలకెత్తిన నారు కొట్టుకొనిపోతుంది. ముందస్తుగా వేసిన నారు ఉరకెత్తిపోతుంది. గత రెండు మూడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో నారుమడులు కొట్టుకుపోయాయి. అలాగే మరో మూడు నాలుగు రోజుల పాటు వర్షాలు పడతాయన్న వాతావరణ శాఖ సూచనలతో అన్నదాతలు కలవరపాటుకు గురవుతున్నారు.

● మండలంలో ఏటా 18 వేల ఎకరాలకు పైగా వరి పంట సాగు చేస్తారు. ఈ ఏడాది సాగునీరు వస్తాయో రావో అన్న అయోమయంలో వరణుడి కరుణతో సాగర్‌జలాలు పొలాలకు వచ్చి పడ్డాయి. గతేడాది కన్నా ఈ ఏడాది ఆలస్యమైనప్పటికీ సమయం సరిపోతుందని అన్నదాతలు విత్తనాలు కొనుగోలు చేసి మరీ నారుమడులు చల్లారు. అనుకోకుండా కురుస్తున్న వర్షాలకు నారుమడుల్లోకి విత్తనం చెల్లాచెదురై కొట్టుకుపోతుంది. మొలకలు ఉరకెత్తి పనికి రాకుండా పోతున్నాయి. నారుమడులు సిద్ధం చేసుకునేందుకు, విత్తన ఖర్చులు, ఎరువుల ఖర్చులు ఇప్పటికే ఎకరాకు రూ.4 వేల వరకు పెట్టుబడి పెట్టారు. వర్షాలతో నారుమడులు పాడవడంతో తిరిగి నారుమడులు చల్లేందుకు అదనపు ఖర్చు కావడమే కాక సమయం కూడా మించిపోతుందని రైతులు వాపోతున్నారు.

రాయితీ విత్తనాల పంపిణీ చేయాలి

ఖరీఫ్ సీజన్ ఆరంభంలో కిలోకు రూ.5 రాయితీ చొప్పున వరి విత్తనాలను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అప్పటికే కొంతమంది రైతులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి చల్లుకున్నారు. ప్రస్తుతం వర్షం కారణంగా నారుమడులు దెబ్బతిన్న రైతులకు రాయితీపై విత్తనాలు అందిస్తే ఖర్చు భారం తగ్గుతుందని రైతులు కోరుతున్నారు. సమయాభావ పరిస్థితుల దృష్ట్యా సీజన్‌లో సాగు చేయదగిన విత్తనాలు పంపిణీ చేయాలని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ప్రతి ఒక్కరూ జాతీయ పతాకాలను ఇళ్లపై ఎగురవేయాలి

తహసీల్దారు శ్రీనివాసరావు



ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో, సిబ్బంది

అచ్చంపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగరగా ఈ నెల 11 నుంచి 15 వరకు ప్రతి ఒక్కరు జాతీయ పతాకాలను తమ ఇళ్లపై ఎగురవేసి దేశ భక్తిని చాటుకోవాలని తహసీల్దారు కుంభా శ్రీనివాసరావు అన్నారు. ఇందులో భాగంగా సోమవారం అచ్చంపేటలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తహసీల్దారు తెలిపారు. జాతీయ పతాకంతో దేశ ప్రజల అనుబంధాన్ని మరింత పెంచడం కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని భావించే వారు ఫ్లాగ్ కోడ్ గురించి తెలుసుకోవడం అవసరం అన్నారు. జాతీయ జెండాను పాలిస్టర్, కాటన్, ఉన్ని, సిల్క్, ఖాదీ వస్త్రాలతో రూపొందించుకోవాలన్నారు. జాతీయ జెండా గౌరవానికి భంగం వాటిల్లేలా ప్రవర్తించొద్దన్నారు. ఇంతకు ముందు ఉదయం నుంచి సాయంత్రం వరకు మాత్రమే జాతీయ జెండాను ఎగురేసేవారని, కానీ జూలై 20, 2022 సవరణల ప్రకారం పగలు, రాత్రి కూడా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, గ్రామ సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యాలయ సబ్బంది, తహసీల్దారు, మండల పరిషత్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చప్టాపై నుంచి నీరు.. రాకపోకలకు అంతరాయం



సోమవారం ఉదయం చప్టాపై నుంచి పారుతున్న నీళ్లు

రాజుపాలెం: ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలోని అనుపాలెం సమీపంలో మాచర్ల-గుంటూరు రహదారిపై ఉన్న చప్టాపై దాదాపు రెండు అడుగుల ఎత్తులో నీరు ప్రవహించడంతో సోమవారం వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి 8 గంటల వరకు భారీ స్థాయిలో వర్షం కురవడంతో చప్టాపై నాలుగడుగుల ఎత్తులో నీరు పారడంతో చప్టాకు ఇరువైపులా దాదాపు రెండు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. వాహనాలు రాకపోకలు స్తంభించడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. కొంత మంది వెనుదిరిగి వెళ్లిపోయారు. చప్టాకు కిందివైపునున్న తూములు పూడుకుపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలి

రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు

సత్తెనపల్లి: మండలంలోని ధూళిపాళ్ల గ్రామానికి చెందిన 54 సంవత్సరాల పచ్చా హనుమంతరావు ఈ నెల 1న అదృశ్యం అయ్యాడని ఆయన ఆచూకీ తెలిస్తే సత్తెనపల్లి రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని రూరల్ సీఐ ఎంవీ సుబ్బారావు సోమవారం కోరారు. హనుమంతురావును వారి కుటుంబ సభ్యుల్లో ఒకరైన పచ్చా వీరాంజనేయులు ఆస్తుల విషయంలో ఒత్తిడి తేవడంతో ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదని అతని వదిన అయిన పచ్చా రమాదేవి ఫిర్యాదు చేసిందని, ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. హనుమంతరావు ఆచూకీ తెలిసిన యెడల సత్తెనపల్లి రూరల్ సీఐ 9440796231, రూరల్ పోలీస్ స్టేషన్ 08641-232033 నంబర్లకు తెలియజేయాలన్నారు. సమాచారం తెలియజేసిన వారికి నగదు బహుమతి ఇవ్వబడుతుందన్నారు.

నులిపురుగుల నిర్మూలనపై అవగాహన



జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమరావతి: అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని వైద్య, విద్యా శాఖ సిబ్బందికి నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులి పురుగులును నులిమేద్దాం అనే నినాదంతో ఈ కార్యక్రమం ప్రారంభించారన్నారు. పిల్లలు, కిశోర బాలల కడుపులో నులిపురుగులు ఉన్నట్లయితే వారు పోషకాహార లోపం, రక్తహీనత ఏర్పడి శారీరక, మానసిక ఎదుగుదల లోపాలు కలిగి ఉంటారన్నారు,. అమరావతి కో లొకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి లీలాప్రసాద్ మాట్లాడుతూ అన్ని అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో మంగళవారం ఉచితంగా పంపిణీ చేసే ఆల్బెండజోల్ మాత్రల ద్వారా నులిపురుగులను నిర్మూలించవచ్చన్నారు. ఈ నెల 20వ తేదీ లోపు నూటికి నూరు శాతం ఆల్బెండజోల్ మాత్రలను మింగించడం పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శివబాబు, కేఎస్ఎన్ ప్రసాద్, వైద్య శాఖ సిబ్బంది, మండలంలోని పాఠశాలల హెచ్ఎంలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీపీఐ పట్టణ కార్యదర్శిగా వల్లెం



సత్తెనపల్లి: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సత్తెనపల్లి పట్టణ కార్యదర్శిగా పట్టణానికి చెందిన వల్లెం లక్ష్మీచెన్నకేశవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశంలో ఈ మేరకు లక్ష్మీచెన్నకేశవరావును పట్టణ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన పట్టణ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. తనను సత్తెనపల్లి పట్టణ కార్యదర్శిగా ఎన్నుకునేందుకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ ముప్పాళ్ళ నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ, జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, సత్తెనపల్లి నియోజకవర్గ కార్యదర్శి ఎం.రమేష్, ఏఐటీయూసీ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంతో పాటు నియోజకవర్గంలో సీపీఐ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని లక్ష్మీచెన్నకేశవరావు అన్నారు.

రోడ్డు పొడవునా గుంతలు.. మరమ్మతులు కరువు



సత్తెనపల్లి-మాదిపాడు ఆర్ అండ్ బీ రోడ్డు దుస్థితి



పట్టణంలోని రైల్వేగేట్ వద్ద ఏర్పడిన గుంతలు

- నీటి మూటలైన పాలకుల మాటలు
- అధ్వానంగా సత్తెనపల్లి-మాదిపాడు రహదారి
- అడుగడుగునా గుంతలతో ప్రయాణికుల అవస్థలు

సత్తెనపల్లి: సంక్రాంతి నాటికి గుంతల్లేని రోడ్లు చూపిస్తామని ఎన్నికలకు ముందు ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు అధికారం చేపట్టి ఏడాది దాటినా మాట నిలబెట్టుకోకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సత్తెనపల్లి-మాదిపాడు ఆర్ అండ్ బీ రహదారి ప్రధానమైనది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డుకు అరకొరగానైనా మరమ్మతులు చేస్తారనుకుంటే అదీ లేదు. ఈ రహదారిని అసలు పట్టించుకోలేదు. ఈ రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు ఈ రోడ్‌లోనే రైల్వే గేటు ఉండటంతో గేటుకు రెండు వైపులా గుంతలు పడి ప్రయాణం ఇబ్బందిగా మారింది. ఏడాది కాలంలో ఈ రోడ్డుపై కనీస మరమ్మతులు కరువయ్యాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలతోపాటు ఈ రోడ్డుపై ట్రాక్టర్లు, లారీలపై ఇసుక రవాణా చేస్తున్నారు. మరమ్మతులు చేయకపోవడంతో ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు రోడ్డు మరింత గుంతలమయంగా మారి ప్రయాణికులు, ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు.

కంకర బయటకు తేలి...

పట్టణంలోని అచ్చంపేట రహదారిలో ఐదు లాంతర్ల సెంటర్ నుంచి శివాలయం వరకు కొంత పర్వాలేదు. కానీ శివాలయం దాటిన దగ్గర నుంచి రైల్వే గేట్ వరకు ఎక్కడికక్కడ కంకర తేలి రాళ్లు కనిపించేలా గుంతలు పడ్డాయి. కొద్దిపాటి చినుకులు పడినా ఆ గుంతల్లో వర్షపు నీరు నిలిచి పాదచారులు నడవడానికి వీలు లేనంతగా ఉంది. ఈ రోడ్డుపై సోషల్ మీడియాలో అనేక వీడియోలు వస్తున్నాయి. ఈ వీడియోలపై కూటమి నాయకుల స్పందిస్తూ గత ప్రభుత్వ వైఫల్యమని విమర్శించడాన్ని ప్రజలు తప్పు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా.. ఇంకా గత ప్రభుత్వం తప్పిదమని ఆరోపించడం సమంజసం కాదని, రోడ్లు వేసి ప్రజలకు మేలు చేయాలని కోరుతున్నారు. రైల్వే గేటు దాటిన తర్వాత అంబేడ్కర్ నగర్, అక్కడి నుంచి పాకాలపాడు, రెంటపాళ్ల వరకు రోడ్డు దుస్థితి దయనీయంగా ఉంది. ప్రజలు ఈ రహదారిలో రాకపోకలు సాగించాలంటే నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి కనీసం రహదారుల మరమ్మతులైనా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సంపద ఎక్కడ సారూ...?



పెదకూరపాడు చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద చెత్తను కాల్చివేసిన దృశ్యం



కేంద్రంలో మందు తాగి వదిలేసిన బీరు బాటిళ్లు

- మందుబాబులకు అడ్డాగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం
- చెత్తను కాల్చివేస్తున్న సిబ్బంది.. అధికారుల పర్యవేక్షణ కరువు
- పాటిబండ్లలో కేంద్రాల పక్కన రోడ్డుపై పడేస్తున్న చెత్త

పెదకూరపాడు: సంపద సృష్టించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పదే పదే చెబుతుంటారు.. కానీ క్షేత్ర స్థాయి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో వేల రుపాయలతో నిర్మించిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు మందుబాబులకు అడ్డాగా మారాయి. మందుబాబులు మద్యం తాగి ఆ మత్తులో నాడెప్ తొట్లను పగలగొట్టి మందు బాటిళ్లను అక్కడే వదిలేసి వెళ్తున్నారు. మరోవైపు సేకరించిన చెత్తను బుగ్గిపాలు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు. ఇదంతా నెలల తరబడి జరుగుతున్నా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో మేజర్ పంచాయతీ పెదకూరపాడులో సంపద ఎలా సృష్టిస్తారో అర్థం కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే పాటిబండ్ల గ్రామంలో చెత్తను సంపద తయారీ కేంద్రం పక్కనే రోడ్డు అంచులో వదిలేసి వెళ్తున్నారు.

లులూ మాల్‌కు ఆర్టీసీ స్థలం కేటాయించొద్దు

- ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి
- ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్



మాట్లాడుతున్న నాయకులు

నరసరావుపేట రూరల్: విజయవాడలోని ఆర్టీసీ స్థలాన్ని లులూ మాల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేయాలని ఏపీ పీటీపీ (ఆర్‌టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు కాసా రాంబాబు, ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె ఖాజా, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంకే రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌కే ఆసీఫ్ సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటు వ్యాపార వేత్తలకు ధారదత్తం చేస్తున్న ప్రభుత్వ చర్యలను ప్రజలంతా ఖండించాలని కోరారు. లులూ మాల్‌కు ఆర్టీసీ స్థలాన్ని కేటాయిస్తూ ఇచ్చిన జీవోను వెనక్కు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీ ఆస్తులు కాపాడుకునేందుకు ఆర్టీసీలోని అన్ని సంఘాలు ఉద్యోమంలో భాగస్వామం కావాలని పిలుపునిచ్చారు. విజయవాడ నడిబొడ్డున గవర్నర్‌పేట-1,2 డిపోలు, పాత బస్టాండ్‌కు సంబంధించిన సుమారు రూ.400 కోట్ల విలువైన 4.15 ఎకరాల స్థలాన్ని లులూ మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టడం దుర్మార్గమని తెలిపారు. దీని వలన రెండు డిపోలకు చెందిన 200 బస్సులు, 1100 మంది ఉద్యోగులను ప్రజలకు దూరం చేస్తుందని విమర్శించారు. నిరంతరం రద్దీగా ఉండే పాతబస్టాండ్ ప్రాంతంలో ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు కారణంగా ప్రయాణికుల సంఖ్య రెట్టింపు అవుతుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో డిపోలను తొలగించడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. 2014లో టీడీపీ ప్రభుత్వం విజయవాడ సమీపంలోని ఆర్టీసీ డ్రైవింగ్ కళాశాలకు చెందిన 29 ఎకరాలను హెచ్ఈఎల్ కంపెనీకి కట్టబెట్టిందని గుర్తు చేశారు. దీనికి ప్రత్యామ్నాయంగా ఇస్తామన్న స్థలం నేటి వరకు ఆర్టీసీ ఇవ్వలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన డీఏ బకాయిలు, 12 పీఆర్‌సీ కమిషన్, ఐఆర్ అమలుపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. దశాబ్దాల చరిత్ర గల ఆర్టీసీని నిర్వీర్యం చేసే ప్రభుత్వ చర్యలను ఖండిస్తూ ఆర్టీసీని కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీకి సిద్ధం

క్రోసూరు: నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని ఏడాది నుంచి 19 సంవత్సరాల పిల్లలకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి సిద్ధం చేసినట్లు పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సాద్, డాక్టర్ సిరిచందన సోమవారం తెలిపారు. మండలంలో మొత్తం 14వేలమంది చిన్నారులు, విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయించనున్నామని, రెండేళ్లలోపు చిన్నారులకు 200 ఎంజీ, మూడు సంవత్సరాలు దాటిన వారికి 400 ఎంజీ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఈపూరు(శావల్యాపురం): ఎరువులు బ్లాక్ మార్కెట్ కాకుండా ముందుస్తుగా అన్ని ఎరువుల దుకాణాలను తనిఖీలు చేస్తున్నట్లు డీడీఏ కార్యాలయ ఏడీఏ వి.హనుమంతరావు తెలిపారు. సోమవారం ఈపూరు మండలం ఈపూరు, కొండ్రముట్ల, ముప్పాళ్ళ గ్రామాల్లో ఎరువుల విత్తనాల దుకాణాలను వ్యవసాయ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ జిల్లా కలెక్టరు అదేశాలు మేరకు ఎరువుల విత్తనాల దుకాణాలు తనిఖీలు చేస్తున్నట్లు తెలిపారు. ఎరువుల దుకాణాల్లో ఎలాంటి బయోమెక్ ప్రొడక్టు నిల్వలు లేవన్నారు.స్టాకు రిజిష్టర్లు బిల్ పుస్తకాలు గోడౌన్‌ల్లో ఉన్ననటువంటి స్టాకును పరిశీలించారు.ఓఫామ్ ఉండి లైసెన్సులో ఇంక్యూషన్ చేసుకోనందున 9 టన్నుల ఎరువులను అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఎరువులు పురుగు మందులు అమ్మకాలు చేసిన దుకాణాదారులు సంబదింత రైతుకు తప్పనిసరిగా రసీదు బిల్లును ఇవ్వాలన్నారు, ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి అమ్మకాలు జరిపిన దుకాణాల లైసెన్సులు రద్దు చేసి అటువంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అయనతో పాటు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణాలపై వరుసదాడులు

బొల్లాపలి: రేషన్ షాపులపై రెవెన్యూ అధికారులు వరుసదాడులు చేస్తున్నారు. చేపట్టారు. తాజాగా సోమవారం మండలంలోని పేరూరుపాడు, వెల్లటూరు, గరికపాడు, జయంతి రామపురం, తదితర గ్రామాల్లోని రేషన్ షాపుల పై సివిల్ సప్లయ్ అధికారులు తనిఖీలు చేపట్టారు. వైఎస్సార్ సానుభూతి పరులకు చెందిన చౌకధరల దుకాణాలపై దాడులు చేస్తున్నారని ఆరోపణలు పది రోజుల వ్యవధి లో దాడులు జరగటం మూడోసారి పల్నాడు జిల్లా పరిధిలోని డిప్యూటీ తహసీల్దార్‌లు, సీఎస్‌డీటీ తోపాటు పలువురు తనిఖీల్లో పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

వినుకొండ: రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వినుకొండ రూరల్ మండలం విఠంరాజుపల్లి గ్రామసమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వినుకొండ రూరల్ మండలం గోకనకొండ గ్రామానికి చెందిన మొగిలి ఆంజనేయులు (24) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

కలహాల నేపథ్యంలో భర్త ఆత్మహత్య

యడ్లపాడు: కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రమైన యడ్లపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన వల్లెపు రాజేష్ (24) కోళ్ల ఫారంలో కూలీగా పనిచేసేవాడు. గత కొంతకాలంగా అతని భార్య సంగీతతో మనస్పర్ధలు నెలకొన్నాయి. ఈ భేదాభిప్రాయాలు పెరిగి పెద్దవి కావడంతో రాజేష్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. దీంతో రాజు శనివారం రాత్రి క్షణికావేశంలో తన ఇంట్లో దూలానికి చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. అది గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే తలుపులు పగలగొట్టి అతడిని కిందకి దించారు. కానీ అప్పటికే రాజేష్ ప్రాణాలు కోల్పోయాడు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ టి.శివరామకృష్ణ సంఘటనా స్థలాన్ని సందర్శించారు.